డబ్బో, అందమో, తెలివితేటలో చూసుకున్న అతిశయమైతే సహించలేక పోయినా అర్థం చేసుకోవచ్చు. కాని మంగళాంబ అతిశయానికి ఎటువంటి ఆధారమూ లేదు. ఆమెకు ప్రపంచజ్ఞానం దాదాపు ఏమీ లేదు. ఆమె పుట్టింటి వారు ఏనాడైనా బాగా బతికారేమోగాని దాసు వెళ్ళి అడిగేనాటికి పరమ దరిద్రులు. మంగళాంబకు భగవంతుడు కాస్త తెల్ల తోలిచ్చాడు. గాని అంద చందాలంటూ ఇవ్వలేదు. అయినా ఆమె ఎవరిలో ఏ విశేషం ఉందని తన ఎదుటగా ఎవరన్నా తెచ్చుకోకుండా, "ఏడిచారు! ఇటువంటి వాళ్ళను లక్షాతొంభైమందిని చూశాం!" అనేది.

మంగళాంబ కాపరానికి వచ్చిన తరువాత మొట్టమొదటిసారిగా దాసు తన తల్లిలో మార్పు గమనించాడు. ఆ మార్పు అతనికి నచ్చకపోయినా దానికి కారణం తన భార్యే అయి ఉంటుందని ఊహించి ఊరుకున్నాడు.

అత్తాకోడళ్ళకు సామాన్యంగా జరిగే కీచులాట గోపి పుట్టిన తర్వాత ఘర్షణగా పరిణమించింది. అప్పుడు కూడా దాసు వాళ్ళమధ్య జోక్యం కలిగించుకోలేదు. వెంకమ్మ మనుమడ్ని 'పిల్లల్ని కనిపెంచినదైనా మనవణ్ణి తన సొంతం చేసుకోవడానికి వాడి పనులన్నీ తానే చెయ్యటానికి చంటిపిల్లలాగా ఉబలాటపడసాగింది. మంగళాంబ ఈ విషయంలో అత్తగార్ని అవగింజంత సందు కూడా ఇవ్వదలచలేదు. ఎప్పుడూ పిల్లవాణ్ణి అంటిపెట్టుకూర్చుని ఇంటిపనిని గూర్చి ఎగగొట్టేది. అత్తగారు కోడల్ని పిల్లవాణ్ణి అంటిపెట్టుకున్నందుకు తిట్టలేక, ఇంటిపని చెయ్యలేదని తిట్టిపోసేది.

మంగళాంబ రెండో పిల్లవాణ్ణి కన్న నెలరోజులకే చావటంతో వెంకమ్మలో వింత పరివర్తన వచ్చింది. ఈ పరివర్తనకు ఆధారమేమిటో దాసు పూర్తిగా ఊహించలేకపోయినాడు. అతనికి దయ్యాల్లో నమ్మకం వుంటే తనభార్య దయ్యమై తన తల్లిని ఆవహించిందనుకుని ఉండేవాడే. వెంకమ్మ ఏ విచిత్ర మానసిక పరిణామం వల్లనో, ఏ తెలియరాని ప్రభావం చేతనో, ఒక్కొక్కసారి అచ్చంగా మంగళాంబలాగా ప్రవర్తించేది, ఆమె లాగే మాట్లాడేది.

తల్లి మనస్తత్వం పూర్తిగా అర్థమైనట్టు దాసు ఎన్నడూ భావించలేకపోయినాడు. కాని ఆవిడ పెంపకంలో కొన్ని ప్రధాన లక్షణాలను మాత్రం అతను అర్థం చేసుకోగలిగాడు.

ఉంటున్నాడు. మనుషుల మొహాలు చూసి ఇంతకాలానికి నవ్వుతున్నాడు. కొత్త కొత్త మాటలు కూడా వస్తున్నాయి. తప్పటడుగులు వేస్తున్నాడు. ఇదంతా చూసి సంతోషించలేకపోతే మీకు వాడిమీద ఉన్న అపేక్ష ఎటు వంటి దనుకోవాలీ ?" అన్నాడు.

"మూడేళ్ళు నిండటానికి సిద్ధంగా ఉన్న వెధవ తప్పటడుగులు వేయటం నీ పెళ్ళాం మహాత్యమే నంటావ్ ?" అన్నది తల్లి.

"అట్లా అయితే మూడేళ్ళపాటు వాడు ముద్దిన దేకటం నీ మహాత్య మనుకుంటాలే. అవసరమైనదానికీ అవసరంలేనిదానికీ రాద్ధాంతం చెయ్య కండి" అన్నాడు దాసు.

ముందు ముందు ఏమైనా ప్రస్తుతానికి మట్టుకు కొంపలో అశాంతి హెచ్చటం దాసుకు కనుపించింది. వెంకమ్మకు కోడలిమీద రోజు రోజుకూ పగ జాస్తి అయిపోతున్నది. ఒకనాడు ఆవిడ వంట మానేసి వొంట్లో బాగా లేదని పడుకున్నది.

"ఏ మండీ వంట మీరు చేస్తారా ? నన్ను చెయ్యమన్నారా ?" అని రాజ్యం భాగ్యమ్మ నడిగింది.

"ఇంకెత్తు చాకిరి ఒంటెత్తున చెయ్యాలి. ఎట్లా తెములుతుందమ్మా?" అన్నది భాగ్యమ్మ, మడిబట్టలు ఆరేసుకుంటూ.

"నన్ను చెయ్యమంటే నేను చేస్తా. కాని నాకు తడీ, మడీ ఆచారము, తెలీవు" అన్నది రాజ్యం.

రాజ్యం వంటింట్లోకి ప్రవేశించిన మరు క్షణం వెంకమ్మ పక్కమీది నుంచి లేచి వచ్చి, "నువు వంట చెయ్యకపోతే పీడా పోయింది. ఇల్లంతా మైల చెయ్యకు" అని రాజ్యాన్ని సాగనంపి, "మడి తెలీదుట ! బ్రాహ్మణ జన్మెత్తలా ! ఇంట్లో ఆచారం గలవాళ్ళం ఏడిస్తిమిగా ! తడిబట్టకడితే వొళ్ళు పుచ్చిపోతుంది గామాలు" అని తనలో తాను మాట్లాడసాగింది.

రాజ్యం ఇంటిపని ఏమీ చెయ్యటంలేదన్న ఆరోపణమీద దాసు పంచాయతీ చెయ్యక తప్పిందిగాదు. దాసు ఈ పంచాయితీని చాలా నేర్పు గానే జరిపాడు. పాచిపని చెయ్యటానికి మనిషి ఉన్నది. మిగిలిన "చాకిరీ" చూస్తూ వెంకమ్మ-భాగ్యమ్మల ఆచారానికి సంబంధించినదేగాని మరొకటి కాదు. రాజ్యం ఎంత ఆచారంగా ఉండటానికి ఒప్పుకున్నా పునిస్త్రీ ఆచారం

హర్షించే పనులన్నీ నా దగ్గిరా చేస్తున్నాడు. నేను సహించనని మీతోకూడా చెబుతున్నా. వాడు నా దగ్గిరికి వచ్చి అఘాయిత్యప్పనులు చెయ్యకుండా చూడండి చాతయితే. మీరు చాతకాకపోతే నేనే తగు జాగ్రత్తపడాలిసొస్తుంది ?" అన్నది రాజ్యం.

ఆమె లోపల ఎంత మంట మండుతున్నదంటే, తన నోటవచ్చే మాటలన్నీ సబబుగా ఉన్నదీ లేనిదీ కూడా ఆమె నిర్ణయించుకోలేక పోయింది. అదీగాక మనుషులను ఎదుట ఉరిగి నోరు పారేసుకు మాట్లాడటం వెంకమ్మకు అలవాటున్నట్టుగా రాజ్యానికి లేదు. అందుచేత ఈ సంఘటనవల్ల వెంకమ్మ చెక్కు చెదరలేదుగాని రాజ్యం నీరసించిపోయింది. ఆమెకు కాళ్ళూ చేతులూ చల్లబడ్డాయి. ఆగకుండా శరీరం చెమటలు కమ్మింది, భరించరాని తలనొప్పి వచ్చేసింది. గది తలుపుగడి వేసుకుని నిద్రపోవటానికి ప్రయత్నిస్తే ఆఖరుకు కళ్ళయినా మూతపడలేదు...

తన మాటలు వినిపించుకోకుండా రాజ్యం గది తలుపు వేసుకున్నప్పటికీ వెంకమ్మ అనదలచుకున్న అవాచ్యాలన్నీ కోడల్ని అని, మనవణ్ని పగామర్చించాలన్న మాట జ్ఞాపకం వచ్చి "నా కన్నతండ్రి గదరా! నీకీ పీడ ఎందుకు దాపరించిందిరా ?" అంటూ వాణ్ణి దగ్గిరికి తీసుకోబోయింది.

గోపీ ఆవిణ్ని నెత్తిమీద ఒక్కటి పెట్టి "ఛో, వెధవముండా! నన్నంటు కోకు !" అంటూ తప్పించుకు పోబోయినాడు. అంతదూరంలో నిలబడి ఆనందించే భాగ్యమ్మ, "ఆఁ ఆఁ ? అదేమిట్రా ? నానమ్మను, అట్లా అనొచ్చుట్రా ?" అంటూ వాణ్ణి పట్టుకోబోయింది. గోపీ ఆవిడ చెయిలి గట్టిగా కొరికి పారిపోయినాడు.

జరిగిందేమిటంటే, వెంకమ్మ రాజ్యాన్ని అన్నమాటలు వాడికి కలిగించిన ఆనందం ఒక్క క్షణం కూడా దక్కలేదు. పెద్దవాళ్ళను అంచనా కట్టే శక్తి పిల్లలకు అపారంగా ఉంటుంది. వెంకమ్మ రాజ్యాన్ని అన్న మాటల్లో లేని బలం రాజ్యం వెంకమ్మని అన్న మాటల్లో గోపీకి కనిపించింది. వాడికి తన నాయనమ్మమీద కోపం వచ్చింది.

"నీ పెళ్ళాం ఏం చేసిందో మాకావుట్రా ?" అని వెంకమ్మ దాసుతో ఇంకా రెండు గంటలకు ఫిర్యాదు చేస్తుందనగానే గోపీ రెండోసారి పిల్లిలాగా రాజ్యం గదిలోకి ప్రవేశించాడు.

"ఏం ?" అన్నది రాజ్యం కోపంగా.

"నీ అద్దం పగలగొట్టాగా ఎట్లా ?" అన్నాడు గోపీ.

"నా బ్రతుక్కి అద్దం ఒకటి తక్కువయింది...ఇంకేం పగలగొట్టటానికి వచ్చావ్ ?" అన్నది రాజ్యం.

"నే నేం పగలగొట్టటానికి రాలా ! నిజం !" అన్నాడు గోపీ, తన మాట రాజ్యం నమ్మాలని విశ్వప్రయత్నం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నవాడల్లే.

గోపీ చేసినదానికి క్షమాపణ చెప్పుకున్నా రాజ్యం అంత సంతోషించి ఉండదేమో.

"పాపం, వాణ్ని చూసి కోప్పడి ఏం లాభం ? అంతా ఆ రాక్షస ముండ చేస్తున్నప్పుడు !" అనుకున్నది రాజ్యం. ఆమె తలనొప్పి ఒక్కసారిగా సగం తగ్గినట్టయి పోయింది.

"ఇట్లావచ్చి కూచో గోపీ ! నువ్వెందుకిట్లా వెధవపన్లు చేస్తావ్ ? నీ సాటి పిల్లలు చూడు ఎట్లా ఉంటారో ? నువ్వు వెళ్ళి ఎవరితోనూ కలిసి ఆడుకోవన్నా ఆడుకోవేం ? ఆడపిల్లవా ? అస్తమానం ఇల్లు కదలకుండా కూచుంటావు !" అన్నది రాజ్యం.

"నా ఇష్టం" అన్నాడు గోపీ. మాటలో ఉన్న దర్పం గొంతులో లేదు.

"నీ మొఖం ! నీఇష్టం ఎవరు సాగనిస్తారు? ఎన్నాళ్ళు సాగనిస్తారు?" అన్నది రాజ్యం.

"నాకు తినటానికేదన్నా పెట్టు."

"నేనెందుకు పెట్టాలి ? మనిద్దరికీ విరోధం. మీ నానమ్మనడుగు."

"నే నా వెధవముండతో అసలు మాట్లాణ్ను !"

రాజ్యం సంతోషం అపుకోలేక పైకి నవ్వేసింది. రాజ్యం నవ్వటం చూసి గోపి మొహం వికసించింది.

"నువ్వు మంచి అబ్బాయివిగా ఉంటేనే నీ కేమన్నా పెట్టటం. సత్యం చూడు ఎంత మంచివాడో !"

'నువు సత్యాన్ని ముద్దుపెట్టుకుంటావు" అన్నాడు గోపీ.

"నీకు సిగ్గులేదుట్రా ? మళ్ళీ దాని చంకలోనే దూరావ్ ? అది నిన్ను గదిలోనుంచి ఇంతకుముందే కొట్టుట్రా గెంటెయ్యా ?" అన్నది వెంకమ్మ.

"నా ఇష్టం ఫో !" అన్నాడు గోపీ. తన ఆత్మగౌరవానికి కళంకం ఆపాదించబడుతున్నట్టు అర్థం చేసుకుని.

"నే చెప్పలేదుటే ?" అన్నది వెంకమ్మ కూతురితో.

"అది కాదు. మనం తినటానికి ఎన్ని ఇచ్చినా వాడికి లెక్కలోకి రాదే, అది రెండు పంచదార బిళ్ళలు పెడితే వాడిట్లా దానికి దాసోహ మవుతాడేం ?" అని ఆశ్చర్యపడింది భాగ్యమ్మ.

అందులో ఉన్న కిటుకేమిటో వాళ్ళకు తెలియలేదు.

"ఇటువంటి వెధవను మనం ఏమీ చెయ్యనే కూడదూ !" అన్నది వెంకమ్మ. ఆ మాట అంటే వాడు తన "దుర్బుద్ధి" సరిచేసుకుంటాడన్న ఆశతో.

"నువ్వు నాకేం చెయ్యలేదు. చెయ్యక్కర్లేదు ఫో ! నువ్వు నాతో అసలు మాటాడేవద్దు" అన్నాడు గోపీ.

"హారి కృతఘ్నుడా ! నిన్నది అంత వెధవనెట్లా చేసిందిరా ? ఏం మత్తు మందు చల్లిందీ ?" అన్నది వెంకమ్మ.

భాగ్యమ్మ తల్లికి అడ్డం వచ్చింది. ఆవిడకి వెంకమ్మ ధోరణి నిరుప యోగంగానూ, చాదస్తంగానూ కనిపించింది.

"అది గాదురా" అన్నది భాగ్యమ్మ లాలూచీగా, "మీ పిన్ని నీతో మమ్మల్ని ఏంమాట లనమన్నదిరా ? చెప్పు, ఫరవాలేదులే ! మేం మళ్ళీ దాన్ని అడగంలే !"

"పిన్నిగాదు, దాని పిండాకూడు ! పిన్నిట ! నీ కది ఎట్లా పిన్నిరా ! నీ అమ్మ చెల్లెలా, నీ బాబాయి పెళ్ళామా ?" అని కసిరింది వెంకమ్మ.

"నువ్వుండమ్మా !" అన్నది భాగ్యమ్మ, "ఏమిరా గోపీ ?"

"నేన్నీతో మాట్లాడను ఫో. నువు శెధవముండవు" అన్నాడు గోపీ ఇంకో పిప్పరమెంటు నోట్లో వేసుకుంటూ.

"నిన్నామాట అదే అనమన్నదా ?" అన్నది భాగ్యమ్మ, ఎట్లాగైనా తన పాచిక పారుతుందేమోనని.

"బడా ?" అన్నది వెంకమ్మ.

"చదువుకుంటావుట్రా ?" అన్నది భాగ్యమ్మ. చదువుకోటం విడ్డూరమైనట్టు.

"ఒరే, ఇట్లారారా ! మాట. కాస్సేపు కూచో.! చదువుకోమని మీపిన్ని చెప్పిందా ఏం ?" అన్నది వెంకమ్మ.

"పిన్నేమిటి పిన్ని ? మా అమ్మ !"

"ఇదెప్పణ్నుంచిరోయ్ ?" అంటూ భాగ్యమ్మ పెద్ద పెట్టున నవ్వింది.

గోపి ఆవిడికేసి చులకనగా చూసి "ఇవాళనుంచే. నేను బడికెళ్ళి చదువుకుంటే అమ్మా అని పిలవనిస్తానంది" అన్నాడు.

"చూశావుటే ?" అన్నది వెంకమ్మ.

"ఎంత ఆలోచనో ?" అన్నది భాగ్యమ్మ.

గోపిని బళ్ళోకి పొమ్మనటంలో ఏమి రహస్య దుర్మార్గం ఉన్నదో వితంతువులకు తెలీదు, కాని ఏదో ఉండి తీరుతుందని వాళ్ళు నిశ్చయించుకున్నారు.

"ఒరే పిచ్చిమొద్దూ, బడికిపోతే పంతులు కొడతార్రా ! అందుకే నిన్ను బడికి పొమ్మంటున్నది" అన్నది వెంకమ్మ.

"తను కొడితే తాట వొలుస్తావని ఈ యెత్తెత్తింది" అన్నది భాగ్యమ్మ

"పంతులు నన్నెందుకు కొడతాడూ ? నన్నెవరూ కొట్టలేరు" అన్నాడు గోపి గర్వంగా.

"అట్లా అనుకున్నావేం. బడిలో మోకాటితండా వేయించి గుంజిళ్ళు తీయిస్తారు. గోడ కుర్చీ వేయిస్తారు. కోదండం వేయిస్తారు. పేంబెత్తాలు పెట్టి ఛెళ్, ఛెళ్ మని రక్తం వరదలయ్యేదాకా కొడతారు. ఒళ్ళంతా ఇంతెత్తు అట్లు పొంగుతుంది. పడుకోటానిక్కూడా ఉండదు. చచ్చేబాధ పెడుతుంది" అన్నది వెంకమ్మ.

గోపి బెదిరిపోయినాడుగాని ఇంకా దర్పం చావలేదు.

"పంతులు కొడితే నేను నాన్నతో చెప్పతాగా ?" అన్నాడు వాడు.

